మనసున్న నాయకుడు జగనన్న

మద్దిపాడు: మాటతప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వరుసగా మూడో సారి డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు రుణమాఫీని అమలు చేస్తున్నందుకు సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్ బాబు ధన్యవాదాలు తెలిపారు. గురువారం సాయంత్రం మండల కేంద్రం మద్దిపాడు కళానిలయంలో వైఎస్సార్ క్రాంతిపథం డీఆర్‌డీఏ ఏపీఎం నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని మనిషిగా చరిత్రలో నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విపక్ష నాయకునిగా ఉండి రాష్ట్రమంతా పాద యాత్ర చేస్తున్న సమయంలో 2019 వరకు నాటికి డ్వాక్రా సంఘాలకు ఉన్న అప్పులన్నీ నాలుగు విడతలుగా ఇస్తానన్న మాట ప్రకారం ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే గ్రూపులకు డబ్బులు జమ చేస్తున్నారని అందులో భాగంగా ఇప్పటికే రెండు విడతలు చెల్లింపులు జరిగాయన్నారు. ఈరోజు మూడో విడత చెక్కును మద్దిపాడు మండల డ్వాక్రా మహిళలకు చెల్లించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. నాలుగు విడతలలో చెల్లించాల్సిన మొత్తం 40.48 కోట్ల రూపాయలు కాగా రెండు విడతల్లో 20.24 కోట్ల రూపాయలు చెల్లింపులు చేశారని, మూడో విడత



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబుతో పార్టీ నాయకులు

మద్దిపాడు మండలంలోని 1142 గ్రూపులకు 10.14 కోట్ల రూపాయలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఏవిధంగా మోసం చేసిందో తెలిపారు.

టీడీపీ భూస్థాపితం కాక తప్పదు

డ్వాక్రా మహిళలకు గత ప్రభుత్వం చేసిన అన్యాయానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి రుణాలన్నీ మాఫీ చేస్తూ వారి తమ్ముడిగా కొడుకుగా అన్నగా కుటుంబంలో ఒక మనిషిగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ అన్నారు. పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒంటరిగా పోటీ చేయడానికి ధైర్యం లేని నాయకుడు చంద్రబాబు అని అటువంటి వ్యక్తిని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఆదరించే పరిస్థితి లేదన్నారు. ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు మాట్లాడుతూ ప్రజలు గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనిస్తున్నారని చెప్పారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కును శాసన సభ్యుని చేతుల మీదుగా అందించారు. మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు వైస్ ఎంపీపీ మోరబోయిన విజయలక్ష్మి సంజీవరావు, చిన్న అప్పయ్య, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ మద్దా లక్ష్మీనారాయణ పంచాయతీ రాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు నర్రా సురేష్, అబ్దుల్ మజీద్, బత్తుల శ్రీనివాసరావు, మందా చిన్న లక్ష్మీనారాయణ, సన్నపు రెడ్డి రమణమ్మ, పల్లకి సత్యన్నారాయణరెడ్డి ఉన్నం ప్రమీద, నట్టే సంజీవరావు, మాజీ సర్పంచ్‌లు జయమ్మ సింగయ్య పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ క్రాంతిపథం డీఆర్‌డీఏ మద్దిపాడు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన ప్రతి ఒక్కరికీ మేలు



బాలినేనిని సత్కరిస్తున్న నేతలు

ఒంగోలు: నమ్మిన ప్రతి ఒక్కరికీ మేలు చేయాలనేదే తన తపన అని, అయితే కొన్నిసార్లు దానికి కూడా అదృష్టం తోడై ఉండాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, స్థానిక శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఏపీ ఫైనాన్స్ కమిషన్ సభ్యునిగా నియమితులైన కాకి కృపారావు ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో బాలినేని మాట్లాడారు. తన కొడుకుపై టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారం బాధిస్తోందని, భగవంతుడు తప్పుడు ఆరోపణలు చేసేవారిని శిక్షిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరో మారు పోటీచేసి 2029కి నా కుమారుడ్ని రాజకీయాల్లోకి తీసుకువచ్చి తాను రిటైర్ అవుతానని ప్రకటించారు. ఏపీ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కాకి కృపారావు మాట్లాడుతూ 2005లో ఉద్యోగ రీత్యా ఒక సమస్య ఎదురైతే కలెక్టర్ వద్ద గంటా 50 నిముషాలు మాట్లాడి తనకు పోస్టింగ్ ఇప్పించబట్టే తాను ఉన్నతమైన హోదాలో రిటైర్ అవ్వగలిగానన్నారు. కుల మతాలకు అతీతంగా , పేద, ధనిక అన్న బేధం లేకుండా ప్రతి ఒక్కరూ బాలినేని వద్దకు వెళ్ళి సమస్య చెప్పుకుంటారన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో యాదాల అశోక్‌బాబు మాట్లాడారు. జవహర్ భారతి పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్‌రెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు, జిల్లా అధికారులు నారాయణరెడ్డి, బాబూరావు, రవికుమార్, యం.వెంకటేశ్వరరావు, శీనారెడ్డి, ఎన్.లక్ష్మానాయక్, ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు బాలినేనిని సత్కరించారు.

క్లుప్తంగా

చీమకుర్తి ఎస్సైగా రామిరెడ్డి



జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో ఎస్సై రామిరెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి నూతన ఎస్సైగా రామిరెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు గురువారం చీమకుర్తిలోని మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను, శివప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శివప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు సీసీఎస్ నుంచి రామిరెడ్డి చీమకుర్తికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం చీమకుర్తి ఎస్సైగా పనిచేస్తున్న ఆంజనేయులను వీఆర్‌కు పంపించినట్లు తెలిసింది.

రామతీర్థంలో పూజలు నిర్వహించిన శిద్దా



రామతీర్థంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు గురువారం రామతీర్థంలోని శ్రీమోక్షరామలింగేశ్వరస్వామి, గంగమ్మ, సాయిబాబా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. స్వామి వారి ఆశీర్వాదాలను స్వీకరించారు.

పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచండి

చీమకుర్తి: పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీఓ ఆర్. పద్మజ పంచాయతీ సిబ్బందికి సూచించారు. గురువారం బూదవాడ పంచాయతీ పరిధిలోని మర్రిచెట్లపాలెంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ, ఈఓఆర్‌డీ శ్రీనివాసులతో కలిసి పర్యవేక్షించారు.

అందరికీ అందుబాటులో వైద్య సేవలు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఉపాస్ ఆసుపత్రి వైద్యులు

ఒంగోలు అర్బన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ఉపాస్ ఆసుపత్రిలో అందరికి వైద్యసేవలు అందుబాటులో ఉండేలా శాశ్వత ప్రత్యేక ప్యాకేజిని తీసుకువచ్చినట్లు ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్‌లు ఉమాపతి, ప్రకాష్ చవల తెలిపారు. గురువారం ఆసుపత్రిలో శాశ్వత ప్రత్యేక ప్యాజికి సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్డియాలజీ, డయాబెటిక్, మాస్టర్ హెల్త్ చెకప్, వెల్ ఉమెన్ హెల్త్ ప్యాకేజీలతో ఎంతో తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్‌లు కె. అనిల్‌కుమార్, అనపర్తి శ్రీనివాస్, పోకూరి శ్రీనివాస్, రాంబాబు, శ్రీధర్ చివుకుల, జ్యోత్స్న, జి. శ్రీనివాస్, పవన్‌కుమార్, ఏ. కృష్ణ, మేనేజర్ యజ్ఞమూర్తి పాల్గొన్నారు.

నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు పరామర్శ

మద్దిపాడు: మండలంలోని నందిపాడు వైఎస్సార్ సీపీ నాయకుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను గురువారం ఉదయం సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు పరామర్శించారు. ఇటీవల నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందగా గురువారం పెద్ద కర్మ సందర్భంగా ఎమ్మెల్యే నందిపాడు చేరుకుని నాగేశ్వరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నాగేశ్వరరావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, సర్పంచ్ మద్దినేని అరుణ శ్రీకాంత్, నాయకులు మద్దినేని చెంచయ్య, కోడూరి అంజయ్య, ఉన్నం కామేశ్వరరావు, కాకి సంజీవరావు, సన్నపు రెడ్డి రమణమ్మ పాల్గొన్నారు.



నందిపాడులో నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేతో పార్టీ నాయకులు

ఆర్సీఎం చర్చిలో నేడు గుడ్ ఫ్రైడే

ఒంగోలు టౌన్: నగరంలోని ఆర్సీఎం చర్చిలో నేడు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఫాదర్ పాల్ తెలిపారు. గురువారం చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం మూడు గంటల నుంచి గుడ్ ఫ్రైడే వేడుకలు మొదలవుతాయని, క్రీస్తు శ్రమలను సమీరించుకుంటూ నాలుగు గంటలకు సెయింట్ చర్చి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి 11 గంటలకు క్యాండిల్ సర్వీస్‌తో మొదలై పవిత్ర దివ్యబలి పూజతో ప్రభువు ఉత్థాన మహోత్సవం జరుగుతుందన్నారు. సమావేశంలో ఫాదర్ రాజేష్, చర్చి సంఘ పెద్దలు బొంతు ఆనందరావు, బైరం రమేష్, స్వరణ హరిబాబు, పాలేటి బాలు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసు చలివేంద్రాలు



చలివేంద్రాలను ప్రారంభిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: వేసవి ఎండల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. గురువారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండు సెంటర్, నెల్లూరు బస్టాండ్ సెంటర్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఒంగోలు టూటౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్.జగదీష్, పోలీసు కంట్రోలు రూం సీఐ ఓ.దుర్గా ప్రసాద్‌లు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి పూల మొక్కను అందజేశారు.

మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఒంగోలు: స్థానిక డాన్‌బాస్కో ఐటీఐ ఇన్‌స్టిట్యూట్‌లో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్, మైనార్టీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఏపీ సహకారంతో ఇక్రా ఎడ్యుకేషన్ ట్రస్టు మైనార్టీ విద్యార్థులకు పలు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రోగ్రాం డైరెక్టర్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. గురువారం స్థానిక డాన్‌బాస్కో శిక్షణ కేంద్రంలో నీట్ పరీక్షకు సంబంధించిన ఉచిత మెటీరియల్‌ను ఆయన ప్రారంభించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మైనార్టీ విద్యార్థులు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రం తీసుకువచ్చేందుకు కృషి చేసిన శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస రెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు కటారి శంకర్, జేసీఎస్ నగర మూడో సెక్టార్ కన్వీనర్ గంటా రామానాయుడు మాట్లాడుతూ మైనార్టీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇక్రా ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ షాకీర్, గౌరవాధ్యక్షులు డాక్టర్ సత్తార్, మేనేజింగ్ డైరెక్టర్ ఫిరోజ్, ట్రస్టు సభ్యులు సల్మాన్, ముజీబ్, ఆజాద్, డాన్ బాస్కో ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి ఫాదర్ జోస్, బ్రదర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా బూచేపల్లి జన్మదిన వేడుకలు



జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కుటుంబ సభ్యులు

చీమకుర్తి: మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం చీమకుర్తిలోని ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన తల్లి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సతీమణి నందిని, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. రామతీర్థంలోని తిరునాళ్లలోనే కేకును కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను మొట్టమొదట జరుపుకున్నారు. అనంతరం గురువారం తెల్లవారు జామును ఇంటి వద్ద అభిమానులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. పలువురు అభిమానులు గజ మాలలతో శాలువాలు కప్పి సత్కరించారు. చీమకుర్తి, దర్శి నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి వేలాది మంది పార్టీ శ్రేణులు వచ్చి బూచేపల్లికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ రీజనల్ కోఆర్డినేటర్ మారెడ్డి సుబ్బారెడ్డి, చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాస రావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీటీసీ సభ్యులు సూడిదేల విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి పి.శంకర్ ఆధ్వర్యంలో తూర్పు గంగవరంలోని వృద్ధాశ్రమంలోని పేదలకు అన్నదానం చేశారు.

చీమకుర్తి: రామతీర్థంలోని గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభపై జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి హాజరై స్థానిక భక్తులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం డ్యాన్సర్‌లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చీమకుర్తి, ఆర్.ఎల్.పురం నుంచి మొత్తం 13 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రభల వద్ద సందడి నెలకొంది.



మాట్లాడుతున్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



ప్రభలపై డ్యాన్సర్‌ల నృత్యం

ఫ్యామిలీ డాక్టర్ సద్వినియోగం చేసుకోండి



సంతనూతలపాడు: ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం గోనుగుంట గ్రామంలో 104 ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి మందులను ఉచితంగా అందిస్తారని తెలిపారు.

సంతనూతలపాడులో ఫ్యామిలీ డాక్టర్

చీమకుర్తి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి ఆధ్వర్యంలో జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పీ.హరిణి ఆధ్వర్యంలో ఫ్యామలి డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

మండలానికి రెండు 104 వాహనాలు

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు పీహెచ్‌సీని రెండు అసుపత్రులుగా విడగొట్టిన నేపథ్యంలో ఇనమనమెళ్లూరు కేంద్రంగా కొత్త పీహెచ్‌సీకి నూతనంగా 104 వాహనాన్ని కేటాయించినట్లు మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ మానస తెలిపారు. గత నెల 24న ఇనమనమెళ్లూరు పీహెచ్‌సీకి డాక్టర్ జగదీష్, డాక్టర్ విన్నీల చౌదరిలను నియమించారని తెలిపారు. రెండు పీహెచ్‌సీల ద్వారా మండల ప్రజలకు మరింత మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ 21 నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ట్రయల్ రన్ నిర్వహించారన్నారు.

మద్దిపాడు మండలంలో 9 సబ్ సెంటర్‌లు ఉన్న నేపథ్యంలో మండలానికి రెండు పీహెచ్‌సీలు కేటాయించారని ఇకపై మద్దిపాడు ఇనమనమెళ్లూరు పీహెచ్‌సీల నుంచి కార్యకలాపాలు సాగుతాయన్నారు. రెండు పీహెచ్‌సీలకు 104 వాహనాలు కేటాయించిన నేపథ్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రోగులకు మరింత మెరుగైన వైద్యాన్ని అందించడానికి వీలు పడుతుందని ఆమె తెలిపారు. గురువారం మద్దిపాడు పీహెచ్‌సీలో నూతనంగా వచ్చిన 104 వాహనానికి కొబ్బరి కాయకొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ఆమె వెంట సీహెచ్‌ఓ లలితమ్మ, పీహెచ్‌ఎన్ రజిత కుమారి, ఎంపీహెచ్‌ఎస్ బాలకోటయ్య, నాగేశ్వరరావు, పద్మ, పద్మావతి, శ్రీను, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

కొత్తపట్నం: పేదరికాన్ని నిర్మూలించాలంటే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయం సిబ్బంది, అన్ని డిపార్ట్‌మెంట్ అధికారులతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 17 లక్ష్యాలను సాధించాలంటే ఇంటి నుంచి లక్ష్యం దిశగా మార్పు చెందాలని, ప్రతి ఒక్క ఇంటిలో, గ్రామాల్లో లక్ష్యాలను అధికమించే విధంగా సచివాలయం సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. ప్రతి రంగంలో లోటు పాట్లను గుర్తించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని సక్రమమైన పరిష్కారం మన చేతుల్లో ఉందన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలు తీర్చుకుంటూ, భావితరాలకు వనరులు సమకూర్చటమే లక్ష్యమన్నారు. పేదరిక నిర్మూలన, ఆకలి చేరిపివేయటం, మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగసమానత్వం, స్వచ్ఛమైన నీరు, మౌలిక వసతులు వంటి తదితర లక్ష్యాలను అందుపుచ్చుకునే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ పింఛన్ కానుక, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వైఎస్సార్ జలయజ్ఞనం, వైఎస్సార్ రైతు భరోసా, పేదలందరికీ ఇళ్ల తదితర పథకాలు ప్రజలకు అందినప్పుడే లక్ష్యాలను సాధించినట్లని చెప్పారు. డాక్టర వైష్ణవి మాట్లాడుతూ ఆరోగ్యపరమైన అంశాలను గురించి, గర్భిణుల రక్తహీనత గురించి వివరించారు. ఎంఈవో అజయ్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యభ్యసించే విధంగా చర్యలు తీసుకుని విద్యా అనేది జ్ఞానాన్ని పెంపొందిస్తుందని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమాదేవి, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, ఐసీడీఎస్ సీడీపీవో మల్లేశ్వరి పలు విషయాలు వివరించారు.

రేడియన్స్ 2023 సంబరాలు

ఒంగోలు: స్థానిక రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన రేడియన్స్ 2023 సంబరాలు గురువారంతో ముగిశాయి. కాలేజీ సెక్రేటరీ శిద్దా హనుమంతరావు మాట్లాడారు. బాలికల విభాగంలో కబడ్డీ (రైజ్ కృష్ణసాయి ప్రకాశం), త్రోబాల్-మిట్టపల్లి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ గుంటూరు, టెన్నికాయిట్- రైజ్ కృష్ణసాయి ప్రకాశం ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో బాస్కెట్‌బాల్-ఎన్‌బీకేఆర్ వాకాడు, కబడ్డీ-ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీ విజయవాడ, టేబుల్ టెన్నిస్-క్విస్ ఇంజనీరింగ్, వాలీబాల్-విద్యానికేతన్ తిరుపతి టీంలు మొదటి స్థానంలో నిలవడంతో వారికి బహుమతులు అందించారు. కాలేజీ డైరెక్టర్ ఏవీ భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జేవీ రమేష్‌బాబు, డాక్టర్ వేణుగోపాల్, గౌరవ చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ బహుమతులు అందించారు.

బ్రాడ్ బ్యాండ్ ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: ఏపీలోని గ్రామాల్లో బ్రాండ్ బ్యాండ్, వైఫై సదుపాయాల ఏర్పాటుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర సమాచార శాఖ సహాయక మంత్రి దేవుసిన్హా చౌహాన్ సమాధానం ఇచ్చారు. నేషనల్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్.. ప్రస్తుతం భారత్ నెట్ ప్రాజెక్టుగా మారిందని, అన్ని గ్రామాలకు దశలవారీగా అమలు చేస్తామని.. ఈ ప్రాజెక్టు మొదటి దశలో 1681 గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్‌సేవలు కల్పిస్తున్నామని, రెండో దశ కింద ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అమలు చేస్తామన్నారు. 11254 గ్రామాల లక్ష్యానికిగాను 3513 గ్రామాలకు బ్రాడ్ బ్యాండ్ సేవలు కల్పించామని చెప్పారు. 20 గ్రామాల లక్ష్యానికిగాను 12 గ్రామాలకు ఉపగ్రహ వ్యవస్థ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్నామన్నారు. మొదటిదశలో ఈ ప్రాజెక్టు మౌలిక సదుపాయాల వినియోగానికి రాబడి భాగస్వామ్యంతో ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. రెండో దశ వినియోగం రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఇళ్ల కనెక్షన్లకు అధిక వేగ ఫైబర్‌ను బీఎస్ఎన్ఎల్ అందిస్తుందన్నారు. ప్రాజెక్టు మొదటి దశ కింద అన్ని మరమ్మతులను నైపుణ్యం గల సంస్థల ద్వారా బీఎస్ఎన్ఎల్ నిర్వహిస్తుండగా రెండో దశ కింద కార్యకలాపాలు, నిర్వహణను సంబంధిత ఏజెన్సీలు అమలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు.